
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు

5

సోమవారం 9 జూన్ 2025

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. పదో తరగతి సంగారెడ్డి జిల్లాలో 2,031 మందికి 1,667 మంది, మెదక్ జిల్లాలో 449 మందికి 268, సిద్దిపేట జిల్లాలో 579 మందికి 355 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ సంగారెడ్డి జిల్లాలో 4,137 మందికి 2,981, మెదక్ జిల్లాలో 940 మందికి 457, సిద్దిపేట జిల్లాలో 928 మందికి 530 మంది ఉత్తీర్ణులయ్యారు. సందేహాలకు 8008403635 నంబర్‌ను సంప్రదించాలని డీఈవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిరుధాన్యాలతో లాభాలు

జహీరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చిరు ధాన్యాలకు డిమాండ్ పెరుగుతున్నందున సాగు విస్తీర్ణం పెంచాలని ఐఐఎంఆర్ ప్రధాన శాస్త్రవేత్త రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. హో(బి), బూచనెల్లి గ్రామాల్లో ఆదివారం వికసిత్‌కృషి సంకల్ప్ అభియాన్‌లో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు.

దుర్గమ్మ సన్నిధిలో జనసందోహం



ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లావాసులతో చుట్టుపక్కల జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుని బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

సొంత వైద్యం వద్దు..

- అనారోగ్యం ఏదైనా ఆస్పత్రికి రావాలి
- సీజనల్ వ్యాధులను సమర్థంగా ఎదుర్కొంటాం
- సంగారెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్

ఫేస్‌టుఫేస్



అనిల్‌కుమార్

సంగారెడ్డి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనిల్ కుమార్ తెలిపారు. జీజీహెచ్‌లో సీజనల్ వ్యాధులపై సన్నద్ధత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఆయన వివరించారు.

సీజనల్ వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సీజనల్ వ్యాధుల చికిత్స కంటే నివారణకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇళ్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి. దోమల నివారణకు ఏర్పాట్లు చేసుకోవాలి. దోమ తెరలు వినియోగించాలి. వేడిచేసి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలి. జీజీహెచ్‌లో పాము, కుక్క, తేలు కాటు మందులు ఉన్నాయి.

డెంగీ సోకినట్లు ఎలా గుర్తించవచ్చు?

వానాకాలం డెంగీ కేసులు నమోదయ్యే అవకాశం ఉంటుంది. డెంగీ సోకితే తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం ఉంటుంది. ప్లేట్‌లెట్లు పడిపోవడంతో ఒంటిపై దద్దుర్లు రావడం, చిగుర్ల నుంచి రక్తం కారడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. జ్వరాలన్నీ డెంగీ కావు. అలాఅని సొంత వైద్యం పనికిరాదు. డాక్టర్లను సంప్రదించి సకాలంలో చికిత్స పొందితే మేలు. ఎలీసా పరీక్ష ద్వారా డెంగీ నిర్ధారణ చేస్తున్నాం. టైఫాయిడ్, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నిర్ధారణకు కిట్లు అందుబాటులో ఉన్నాయి.

ఆస్పత్రిలో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారా?

జనరల్ హాస్పిటల్‌లో అన్నిరకాల వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు చేసే సదుపాయాలు ఉన్నాయి. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చేవారికి డాక్టర్లు సూచించిన అన్ని పరీక్షలు ఉచితంగానే చేస్తాం. రోగులను పరీక్షల కోసం బయటికి పంపబోము.

సిబ్బంది, మందులు, పడకల కొరత ఏమైనా ఉందా?

జీజీహెచ్‌లో అన్ని విభాగాల్లో సరిపడా డాక్టర్లు ఉన్నారు. సీజనల్ వ్యాధులతో పాటు కుక్క, పాము కాటు బాధితులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు డాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. అన్ని రోగాలకు అవసరమైన మందుల నిల్వలు సరిపడా ఉన్నాయి. సిబ్బంది, మందులు, పడకల కొరత లేదు.

వేగంగా విస్తరిస్తున్న శివారు మున్సిపాలిటీల్లో డ్రైనేజీ నీరు వాగులు, కాలువల్లో ప్రవహించడం ద్వారా పర్యావరణం దెబ్బతింటోంది. దుర్గంధం, దోమల బెడద పట్టణ జీవితాన్ని దుర్భరంగా మారుస్తోంది. మురుగు నీటితో నిండుతున్న చెరువుల చుట్టుపక్కల కాలనీలు నరకం చూస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సీవేజీట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో రెండు భారీ మురుగు శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు నిధులను కేటాయించింది.



ఇసుకబావి వాగుపై 100ఎంఎల్‌డీ కెపాసిటీతో ఏర్పాటు చేస్తున్న ఎస్‌టీపీ ప్లాంట్‌కు రూ. 200.56 కోట్లు కేటాయించగా, జీవ వైవిధ్య చెరువు వద్ద ఏర్పాటు చేయనున్న ప్లాంటుకు రూ. 116.08 కోట్లను కేటాయించారు.

మురుగు శుద్ధిపై ముందడుగు

- *రూ. 316.56 కోట్లతో*
- అమీన్‌పూర్‌లో రెండు 'ఎస్టీపీ'లు
- హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్మాణం
- స్థలం కోసం రెవెన్యూ సిబ్బంది అన్వేషణ
- సర్వే నంబర్ 993లో భూమి కేటాయించాలని ప్రతిపాదన
- స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరాలు

అమీన్‌పూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలు, జనావాసాల నుంచి నిత్యం విడుదలవుతున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు రెండు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ పరిధిలోని వేలాది జనావాసాల నుంచి విడుదలయ్యే మురుగును శుద్ధిచేసే ప్రకియ కార్యరూపం దాల్చబోతోంది. హెచ్ఎండబ్ల్యూఎస్ నేతృత్వంలో అమృత్ పథకం కింద రూ.316.56 కోట్ల బడ్జెట్‌తో ఎస్‌టీపీలను ఏర్పాటు చేసేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇసుక బావి వాగులో ప్రవహిస్తున్న మురుగు, కలుషిత నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా 993 సర్వే నంబర్‌లో ఏర్పాటు చేయబోతున్న ఎస్టీపీలకు చేర్చాలని, శుద్ధి చేసిన తరువాత స్వచ్ఛమైన నీటిని తిరిగి అదే వాగులోకి విడుదల చేయాలని అధికారులు ప్రతిపాదిస్తున్నారు.

స్థల సేకరణపై అభ్యంతరాలు

అమీన్‌పూర్ మున్సిపాలిటీకి మంజూరైన రెండు ఎస్టీపీల ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఆదేశించడంతో రెవెన్యూ సిబ్బంది అన్వేషణ ప్రారంభించారు. అమీన్‌పూర్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న 993 సర్వే నంబర్‌లో ఏడెకరాల స్థలంలో ఎస్‌టీపీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే, గతంలోనే ఈ స్థలాన్ని మినీస్టేడియం ఏర్పాటు కోసం కేటాయించగా, రూ. కోటి ఖర్చు చేసి కొండలు, గుట్టలను చదును చేశారు. ప్రస్తుతం ఇదే స్థలాన్ని ఎస్టీపీ ఏర్పాటు కోసం కేటాయించాలని ప్రతిపాదించడంపై పట్టణ ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే స్థలం పక్కన ఏర్పాటు చేసిన డంప్ యార్డ్‌తో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పుడు ఎస్టీపీ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయిస్తే మరింత దారుణంగా తయారవుతుందని వాపోతున్నారు. మురుగునీరు పారుతున్న వాగులు, కాల్వల పక్కన ఎస్టీపీలు ఏర్పాటు చేసి

మిగతా 8వ పేజీలో



అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయం

టెండర్లు ఖరారు

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో 100ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) కెపాసిటీతో ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీ ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 200.56 కోట్లు కేటాయించింది. గ్లోబల్ టెండర్ ద్వారా మెగా ఇంజనీరింగ్ సంస్థకు పనులు దక్కాయి. బిల్ట్ ఆపరేట్ మెయింటెనెన్స్ పద్ధతిలో నిర్వహణ బాధ్యతలు ఆ సంస్థ 15 ఏళ్లు ఆ సంస్థనే చూసుకుంటుంది. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ద్వారా ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్‌లో అత్యాధునిక సాంకేతిక పద్ధతిని వినియోగిస్తున్నారు. 28 ఎంఎల్‌డీ సామర్థ్యంతో అమీన్‌పూర్ పెద్ద చెరువు దిగువన హెచ్ఎంటీ కాలనీ వద్ద ఏర్పాటు చేస్తున్న మరో ఎస్టీపీకి రూ. 116.08 కోట్లను కేటాయించారు. ఈ ప్యాకేజీ టెండరింగ్ దశలో ఉంది. జీవ వైవిధ్య చెరువుగా గుర్తించిన ఈ చెరువులోకి నిత్యం వందలాది కాలనీల నుంచి ప్రవహించే మురుగునీటిని శుద్ధి చేయనున్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీ!

- అదనపు కలెక్టర్ లేరు
- పలు శాఖల్లో ఇన్‌చార్జిలతోనే సరి
- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రభావం
- మెదక్ జిల్లాలో ఇదీ పరిస్థితి!



మెదక్ జిల్లా కలెక్టరేట్

మెదక్ అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో కీలకమైన ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీని ప్రభావం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై పడుతున్నది. జిల్లా పాలనలో కీలకమైన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఉద్యోగ విరమణ పొందినా కొత్తగా ఎవరినీ నియమించలేదు. ఎక్సైజ్, ఆర్టీఏ, మైనింగ్, బీసీ సంక్షేమ, పశుసంవర్ధక, లీగల్ మెట్రాలజీ, భూగర్భజల, సబ్‌రిజిస్ట్రార్ తదితర శాఖల్లో ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్నారు. ఉన్నతాధికారులే కాదు కిందిస్థాయి సిబ్బంది పరిస్థితి ఇలాగే ఉన్నది. గతేడాది స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేష్ ఉద్యోగ విమరణ పొందడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ నగేష్ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కీలకమైన రెవెన్యూశాఖలో పనులతోనే నిత్యం బిజీగా ఉండే ఆయనకు స్థానిక సంస్థల అదనపు బాధ్యతలతో మరింత పని భారం పెరిగింది. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో, ఆ శాఖ టెక్నికల్ అధికారి వినయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కొత్తగా నియమించిన పశుసంవర్ధకశాఖ అధికారి విధుల్లో చేరకపోవడంతో మరో

మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన సేవలు

- రేషన్ లబ్ధిదారులందరికీ సన్నబియ్యం పంపిణీ
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. రామాయంపేట, ధర్మారం ఆస్పత్రులను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించి వైద్యులు, సిబ్బంది సమయపాలనను పరిశీలించారు. జరిగింది. రికార్డులను తనిఖీ చేసి, మందుల నిల్వలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిధిలోని అక్కన్నపేటలో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. బియ్యం నిల్వలను, రికార్డులను పరిశీలించారు. లబ్ధిదారులను అడిగి సన్నబియ్యం పంపిణీ జరుగుతున్న తీరును తెలుసుకున్నారు.



రామాయంపేట ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

క్వారీలో తనిఖీలు

కొల్చారం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాంపూర్ కేసీపీ క్వారీని ఆదివారం మైనింగ్ ఆర్ఐ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. క్వారీలో ఎంతమేర తవ్వకాలు చేపడుతున్నారని పరిశీలించారు. ఇటీవల వచ్చిన వార్త నేపథ్యంలో క్వారీని పరిశీలించామని, అనుమతులు ఉన్నంత వరకే క్వారీలో క్రషింగ్ జరిగిందని గుర్తించినట్లు పేర్కొన్నారు.

కోలుకున్న చిన్నారులు.. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి

అల్లాదుర్గం పీహెచ్‌సీలో వైద్యశాఖ ఉన్నతాధికారుల విచారణ

అల్లాదుర్గం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా అల్లాదుర్గంలో జ్వరం మందు తాగించడంతో అస్వస్థతకు గురైన చిన్నారులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అల్లాదుర్గం బుడగజంగాల కాలనీకి చెందిన కడమంచి సాయమ్మ, సిద్దయ్య దంపతుల ఐదుగురు పిల్లలు అస్వస్థతకు గురికాగా.. తల్లి జ్వరం, దగ్గు మందు తాగించడంతో ఒకరు మృతిచెందగా, మిగిలిన నలుగురు ఆస్పత్రిపాలైన సంఘటన శనివారం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు ఐశ్వర్య, రేణుక, శ్రీను, గణేష్ కోలుకోవడంతో ఆదివారం జోగిపేట ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఈ ఘటనపై శనివారం రాత్రి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అనీల వేర్వేరుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి విచారణ జరిపారు. నెల క్రితం ఇచ్చిన మందుల సీసాలనే తల్లి పిల్లలకు తాగించినట్లు గుర్తించి, ఆ బాటిళ్లను ల్యాబ్‌కు పంపించారు. తల్లిదండ్రులు ఇంకేమైనా మందులు ఇచ్చారా అని ఆరా తీశారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు పేర్కొన్నారు.



జోగిపేట ఆస్పత్రిలో కోలుకున్న చిన్నారులు





మృగశిర కార్తె.. చేపలకు ఫుల్ డిమాండ్

మృగశిర కార్తె రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజలు విశ్వసిస్తారు. మృగశిర ప్రవేశం సందర్భంగా ఆదివారం చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. డిమాండ్ పెరగడంతో రెండింతలు ధర పెంచి విక్రయించారు. మామూలు రోజుల్లో కిలో రూ.400 ధర పలికే కొర్రమొట్ట రకం చేపలను రూ. 800కు విక్రయించారు. బంగారు తీగ, బొచ్చ, రవ్వ తదితర రకాలు కిలో రూ.300 వరకు విక్రయించారు.

-న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

కుంగ్‌ఫూలో ప్రణతికి బ్లాక్‌బెల్ట్

సంగారెడ్డి అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం తేర్పోల్ గ్రామానికి చెందిన సీహెచ్. ప్రణతి కుంగ్‌ఫూలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన సమ్మర్ కోచింగ్ ముగింపు క్యాంపులో ప్రణతి పాల్గొని ప్రతిభ కనబర్చారు. బ్లాక్‌బెల్ట్ సాధించిన ప్రణతికి బీజేపీ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్ ఫస్ట్ డిగ్రీని అందజేసి అభినందించారు.


కుంగ్‌ఫూలో బ్లాక్‌బెల్ట్‌లో ఫస్ట్ డిగ్రీ సాధించిన ప్రణతి

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

హత్నూర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కంసానిపల్లి నర్సింలు తన ఎద్దులను తీసుకొని మేత కోసమని గ్రామ శివారులోకి వెళ్లాడు. వసీంకుంట సమీపంలో ఎద్లు మేత మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై ఓ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.లక్ష విలువ గల ఎద్దు మృతిచెందడంతో నర్సింలు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ప్రారంభానికి నోచుకోని వైకుంఠధామం

● మంత్రి చేతులమీదుగా ప్రారంభించేందుకు యత్నం
● పంతాలకు పోకుండా వినియోగంలోకి తేవాలని స్థానికుల వేడుకోలు

నర్సాపూర్, జూన్ (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లోని శ్మశానవాటికలోని స్థలంలో రూ.కోటితో ఏడాది క్రితం నిర్మించిన వైకుంఠధామం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ఈ వైకుంఠధామంలో పురుషులు, మహిళలకు వేర్వేరుగా స్నానాల గదులు, దహన క్రియలకు రెండు ప్లాట్‌ఫాంలు, అంత్యక్రియలకు పూర్తయ్యే వరకు సంబంధీకులు వేచి ఉండే గది, దింపుడుకల్లం, కలప నిల్వకు గది, ఆఫీసు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇన్ని సదుపాయాలతో నిర్మించిన వైకుంఠధామాన్ని వినియోగంలోకి తేకపోవడంతో గోడలకు పగుళ్లు వస్తున్నాయి. అంతే కాకుండా అందులోని సామగ్రి చోరీకి గురవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే సునీతారెడ్డి ఉండటంతో అధికార కాంగ్రెస్ నాయకులు మంత్రి చేతులమీదుగా ప్రారంభం చేయించాలని చూస్తుండడం వల్ల జాప్యం జరుగుతుందన్న ప్రచారం స్థానికంగా ఉన్నది. ఇప్పటికైనా పంతాలకు పోకుండా వైకుంఠధామాన్ని వీలైనంత తొందరగా వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.


నర్సాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న ఆధునిక వైకుంఠధామంలోని నిర్మాణాలు

శివ్వంపేటలో సైబర్ మోసం

● రూ.45,720 వేలు మోసపోయిన యువకుడు

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాడి చేతిలో మోసపోయిన సంఘటన శివ్వంపేట మండలం బిజిలిపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కట్టమీద శ్రీకాంత్(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఏప్రిల్ 25న ఉదయం 11 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి బంజారాహిల్స్ హైదరాబాద్‌లోని 'దని' వడ్డీ వ్యక్తిగత లోన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని, హౌసింగ్ లోన్ రూ.10 లక్షలు ఇస్తామన్నాడు. శ్రీకాంత్ లోన్ తీసుకుంటానని చెప్పడంతో అదేరోజు సాయంత్రం 3 గంటలకు ఫోన్‌చేసిన వ్యక్తి సేవింగ్ ఎకౌంట్ ఉంటే లోన్ రాదని, కరెంటు అకౌంట్ నుంచి డబ్బులు పంపించాలనడంతో రూ.16,850 పంపించాడు. మళ్లీ 3.30 గంటలకు ఎన్‌వోసీకి రూ.1000, 26 ఏప్రిల్ ఉదయం 12 గంటలకు చార్జెస్ కింద రూ.1000 చెల్లించామని అడగ్గా ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఓటీపీ వస్తుంది.. దానికి చార్జెస్ అవుతుందని రూ.8870 వేయాల్సిందిగా చెప్పడంతో అనుమానం వచ్చిన శ్రీకాంత్ మోసపోయానని సైబర్ టోల్‌ఫ్రీ నంబరు 1930 ఫోన్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● కోతులు అడ్డురావడంతో ప్రమాదం

నంగునూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కోతులు అడ్డు రావడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చిన్నకోడూరు మండలం సిక్లిందాపూర్ గ్రామానికి చెందిన జాలిగామ కనకవ్వ(60) బంధువుల గృహ ప్రవేశానికి నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి బైక్‌పై వస్తుంది. గ్రామంలోని బద్దిపడగ శ్రీనివాస్ రెడ్డి ఇంటి ముందట కోతుల గుంపు అడ్డురావడంతో వెనకాల కూర్చున్న కనకవ్వ కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను 108 అంబులెన్స్‌లో చికిత్స కోసం సిద్దిపేట తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరి గుడి కందుల భారతవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్ పేట పోలీసులు తెలిపారు.

'బడి' వీడుతున్న బాలలు

● ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం కరువు
● కుల వృత్తి వైపు మళ్లుతున్న పిల్లలు

మాసాయిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా మండల కేంద్రమైన మాసాయిపేటలోని వడ్డెర కాలనీలో ఎన్నో ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రం, బడి లేకపోవడంతో కాలనీల పిల్లలు బడికి దూరమవుతున్నారు. వడ్డెర కాలనీ జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. ఇక్కడి బండపై సుమారు 30 వడ్డెర కుటుంబాలు ఏళ్లుగా జీవిస్తున్నాయి. అయితే ఈ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం కానీ, పాఠశాల కానీ లేకపోవడంతో చిన్నారులు పాఠశాలలకు వెళ్లలేక కులవృత్తి వైపు మళ్లుతున్నారు. ప్రతీసారి ఓట్ల కోసం వచ్చిన నాయకులను కాలనీ ప్రజలు అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల కట్టించాలని విజ్ఞప్తులు చేసినా ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి తమ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


మాసాయిపేటలోని వడ్డెర కాలనీ

రేషన్ బియ్యం కోసం పడిగాపులు

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం కోసం ఉదయం 6 నుంచి సీరియల్ కోసం పడిగాపులు కాస్తున్నామని నవాబ్‌పేట్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని నవాబుపేటలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మూడునెలల రేషన్ బియ్యం కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 6 నుంచి బియ్యం కోసం ఆరుసార్లు వేలిముద్రకు దాదాపు గంట టైం పడుతుందని, రేషన్ బియ్యం తీసుకోవడం ఇబ్బందిగా మారిందని చెప్పారు. అధికారులు స్పందించి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నవాబ్‌పేట్‌లో రేషన్ బియ్యం కోసం కూర్చున్న లబ్ధిదారులు

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు

● ఒకరికి తీవ్రగాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

చేగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన వడియారం బైపాస్ జంక్షన్ వద్ద ఆదివారం ఉదయం చోటు చేసుకున్నది. హైదరాబాద్ నుంచి వస్తున్న కారును హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న తూప్రాన్ హెడ్ కానిస్టేబుల్ కిషన్ నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

● నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో ఘటన

ఫోటో;8ఎన్‌కెడి కెఎల్‌ఆర్‌పి 53 నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లి మరణించిన రాంరెడ్డిపేటకు చెందిన మృతదేహం

ఫోటో;8ఎన్‌కెడి కెఎల్‌ఆర్‌పి 54 పోతుగంటి గూల గంగారాం(ఫైల్ ఫోటో)

కల్హేర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట గ్రామానికి చెందిన పోతుగంటి గూల గంగారాం(48) ఆదివారం గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లాడు. వల వేసి చేపలు పట్టే క్రమంలో బలమైన ఈదురుగాలులు వీయడంతో థర్మాకోల్‌తో తయారు చేసిన తెప్ప తలకిందులై మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య దస్తవ్వ ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతి

సంగారెడ్డి క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణ శివారులోని మహబూబ్‌సాగర్ చెరువులో పడి గుర్తు తెలియని మహిళ మృతిచెందినట్టు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని, బట్టలు ఉతుక్కునేందుకో.. లేదా కాలకృత్యాలు తీర్చుకునేందుకో వెళ్లి మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి గురించి తెలిసిన వారు పోలీసులకు సమాచారమందించాలని ఆయన కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువాలోని బట్టను చిందరవందరగా పడేసిన దృశ్యం

చేగుంట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన చేగుంట మండల కేంద్రంలోని హమాలీ కాలనీలో శనివారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న చిటబోయిన ఆంజనేయులు పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు తాళం పగులగొట్టి మూడు తులాల బంగారం, 60 తులాల వెండి, రూ.15 వేల నగదు చోరీకి పాల్పడ్డారు. రూ.4 లక్షల వరకు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

అప్పులబాధతో యువకుని ఆత్మహత్య

మాసాయిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాసాయిపేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన బర్రె మహేష్(30) తన స్నేహితుల వద్ద వ్యక్తిగత అవసరాల కోసం రూ.13 లక్షల వరకు అప్పులు చేశాడు. అయితే అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శనివారం రాత్రి తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు గమనించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.


బర్రె మహేష్ (ఫైల్)

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శభాష్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. చేగుంట మండలం చందాయిపేట్ గ్రామానికి చెందిన షాబుద్దీన్(45) సుమారు ఆరేళ్ల క్రితం బతుకుతెరువు కోసం కుటుంబ సభ్యులతో శభాష్‌పల్లి వచ్చి జీవనం కొనసాగిస్తున్నారు. 20 ఏళ్లుగా మద్యానికి బానిసైన షాబుద్దీన్ తరచూ భార్య, కొడుకుతో గొడవపడేవాడు. మే 18న షాబుద్దీన్ భార్య రషీద బేగం, కొడుకు సమిరుద్దీన్‌ను ఇంట్లోంచి వెళ్లిపొమ్మని కొట్టడంతో.. తూప్రాన్‌లో నివాసముంటున్నారు. కాగా ఈనెల 3న షాబుద్దీన్ కొడుకుతో ఫోన్‌లో మాట్లాడాడు. 7న బక్రీద్ పండుగ కావడంతో షాబుద్దీన్ తమ్ముడు మాంసం ఇచ్చేందుకు ఇంటికి వెళ్లాడు. తలుపులు మూసి ఉండడంతో పాటు దుర్వాసన రావడంతో తలుపులు తెరిచి చూసేసరికి షాబుద్దీన్ ఇంట్లో దూలానికి ఉరేసుకుని కనిపించాడు. కుమారుడు సమిరుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

మద్యం తాగించి.. సొమ్ము దొంగిలించాడు..

● తులం బంగారం, 50 తులాల వెండి అపహరణ

మనోహరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి మద్యం తాగించి మహిళ మెడలోంచి తులం బంగారం, 50 తులాల వెండితో ఉడాయించారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా, రాయపోల్ మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన మన్నే రామవ్వ శనివారం రాయపోల్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి పాములపర్తి గ్రామానికి పోయేందుకు గజ్వేల్ బస్టాండ్‌లో బస్సు కోసం వేచిచూస్తున్నది. ఇంతలో ఓ మహిళ, ఓ వ్యక్తి అక్కడికి వచ్చి రామవ్వతో మాట కలిపారు. నువ్వు ఎక్కడికి వెళ్లాలి అని అడగ్గా.. పాములపర్తికి అని చెప్పింది. మేము అదే గ్రామానికి వెళ్తున్నామని మాయమాటలు చెప్పి బైక్‌పై ఎక్కించుకున్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామ శివారులోని క్యాతమ్మ ఆలయం వద్దకు చేరుకున్న ముగ్గురు మద్యం సేవించారు. ఇదే అదునుగా భావించిన సదరు వ్యక్తులు రామవ్వ మెడలో ఉన్న తులం బంగారం, 50 తులాల వెండి కడియాలతో పారిపోయారు. రామవ్వ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రామవ్వను బైక్‌పై తీసుకెళ్తున్న నిందితుడు

పాముకాటుతో వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో వ్యక్తి మృతిచెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకున్నది. త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన అయోనుద్దీన్(44) కూలీగా పనిచేస్తూ కిష్టసాగర్ సమీపంలో రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం ప్రమాదవశాత్తు పాముకాటు వేసినట్లు గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

డయల్ 100కు సత్వర స్పందన

నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులు


యూనూస్‌ను కాపాడిన పోలీసులు మహేందర్, మేషక్

సంగారెడ్డి క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకుంటున్నానని డయల్ 100కు ఫోన్ చేసి చెప్పిన ఓ వ్యక్తిని పోలీసులు మాటల్లో పెట్టి ఆత్మహత్య చేసుకోకుండా ఆపి నిండు ప్రాణాలు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని డబుల్ బెడ్‌రూమ్‌లో నివాసముంటున్న యూనూస్ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురయ్యాడు. దీంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆదివారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో డయల్ 100కు ఫోన్ చేశాడు. డయల్ 100కు వచ్చిన సమాచారంతో సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లు మహేందర్, మేషక్‌లు వెంటనే స్పందించారు. సదరు యూనూస్‌కు ఫోన్ చేసి మాటల్లో పెట్టారు. అతనితో ఫోన్‌లో మాట్లాడుతూనే ఫసల్‌వాదిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్దకు హుటాహుటిన చేరుకున్నారు. నేరుగా అతని రూమ్ వెళ్లి యూనూస్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో మనసు మార్చుకున్న యూనూస్‌ను అతని బాబాయ్ మౌలాలికి అప్పగించారు. సకాలంలో స్పందించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన కానిస్టేబుళ్లు మహేందర్, మేషక్‌లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ క్యాంప్‌నకు ఎంపిక


శశ్రీత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

వెల్దుర్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు చెందిన శశ్రీత్ గౌడ్ రాష్ట్రస్థాయి క్రికెట్ క్యాంపునకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ బీఎన్‌రెడ్డి నగర్‌లోని ఏవైఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో గత నెలలో జరిగిన యంగ్ స్టార్ క్రికెట్ లీగ్ నేషనల్ టోర్నమెంట్‌లోశశ్రీత్ గౌడ్ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి క్యాంపుకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తెలిపారు. ఆదివారం విద్యార్థి స్వగ్రామమైన చర్లపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యోగాసనా జడ్జిగా తోట సంధ్య



పంజాబ్‌లో శిక్షణ కార్యక్రమంలో సంధ్య, తదితరులు

సిద్దిపేట కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగాసనా జడ్జిగా సిద్దిపేటకు చెందిన ప్రముఖ యోగ శిక్షకురాలు తోట సంధ్య శిక్షణ పూర్తి చేసుకున్నారు. యోగాసనా భారత్ ఆధ్వర్యంలో ఎన్ఐఎస్ సెంటర్ పటియాల పంజాబ్‌లో నేషనల్ జడ్జెస్ ట్రైనింగ్‌లో రాష్ట్రం నుంచి ఆరుగురు పాల్గొన్నారు. ఇందులో తోట సంధ్య పాల్గొని విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆమెను తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, ఈట అరవింద్, విక్రం రెడ్డి, అంజయ్య చిప్ప ప్రభాకర్, హరిప్రసాద్, బసవరాజు కుమార్ తదితరులు అభినందించారు.

మెట్రోని సంగారెడ్డి వరకు విస్తరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

సంగారెడ్డి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జనాభా, రద్దీని ప్రాతిపదికగా తీసుకుని మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైల్‌ను విస్తరించాలని సీడీఆర్‌పీ సిబ్బంది ప్రతినిధి ప్రధాన కార్యదర్శి అజయ్ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. భారీ పరిశ్రమలు ఉన్న పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు 21 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరించడం అత్యవసరమన్నారు. మెట్రో ఫేజ్ 2 ప్రణాళికను పునంపరిశీలించి పటాన్‌చెరు నుంచి పోతిరెడ్డిపల్లి చౌరస్తా సంగారెడ్డి వరకు 21 కిలో మీటర్లు విస్తరణను చేర్చాలని లేఖలో కోరారు.

నిజాంపేటలో చేప ప్రసాదం పంపిణీ


చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న తడకంటి కుటుంబ సభ్యులు

నారాయణఖేడ్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నిజాంపేట మడల కేంద్రంలో మృగశిర కార్తెను పురస్కరించుకుని ఆదివారం తడకంటి కుటుంబ సభ్యులు చేప ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ప్రసాదం కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. 82 సంవత్సరాలుగా తడకంటి కుటుంబం ఇక్కడ చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తోంది. ఈ ప్రసాదం కోసం ఈ ప్రాంతవాసులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన వారు కూడా పెద్ద ఎత్తున వస్తుంటారు. తడకంటి పర్వాగౌడ్, తడకంటి లింగాగౌడ్, నాగరాజ్‌గౌడ్, సాయిబాబా గౌడ్, వెంకటేష్‌గౌడ్, శంకర్‌గౌడ్ చేప ప్రసాదం తినిపించారు. మాంసహారం తినని వారికి బెల్లంలో ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గద్వాల నుంచి ఆదిలాబాద్ వరకు ఆలయాలు



తూప్రాన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గద్వాల నుంచి ఆదిలాబాద్ వరకు ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయాలను పెద్ద ఎత్తున నిర్మిస్తున్నట్లు శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ ముదిరాజ్ పేర్కొన్నారు. మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన శ్రీపెద్దమ్మ ఆలయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పెద్దమ్మ ఆలయాల నిర్మాణానికి ముదిరాజ్‌లు ఐక్యంగా కదులుతున్నారని, దేవాలయాల నిర్మాణం ఐక్యతకు నిదర్శనమన్నారు. ఆలయాల నిర్మాణాలకు భిన్నమైన కులాలు కూడా సహకరిస్తున్నారని, ఆలయాల నిర్మాణం ప్రశాంతతకు నిలయాలు అన్నారు. ప్రభుత్వాలు కూడా ఆలయాల నిర్మాణాలకు 20 శాతం చెల్లిస్తే 80శాతం అందజేయడంతో నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు. స్వాతంత్ర్య వచ్చి 75 ఏళ్లు గడిచిపోయినా ముదిరాజ్‌లు ఇంకా వెనుకబడి ఉన్నారన్నారు. అందరితో సమానంగా ఎదగాలని, పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలని బండ ప్రకాష్ ఆకాంక్షించారు. ఇందులో గ్రామస్థులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులకు అందుబాటులో సూపర్ స్పెషాలిటీ




వంద పడకలతో ఆస్పత్రి
పారిశ్రామిక వాడలో ఏర్పాటు
త్వరలోనే అందుబాటులోకి..
సిద్ధం చేస్తున్న అధికారులు

రామచంద్రాపురం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ప్రజలకు ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల వారికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి రానుంది. పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లోని రసాయన పరిశ్రమల్లోని కార్మికులకు అధునాతన వైద్య సేవలు అందించాలనే హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం, ఈ ప్రాంత పరిశ్రమల భాగస్వామ్యంతో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువస్తోంది. మరో 40 రోజుల్లో ఈ ఆస్పత్రిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం పూర్తిగా డ్రగ్ పరిశ్రమలకు హబ్‌గా మారింది. రసాయనాల బారిన పడిన కార్మికులు మృత్యువాత పడుతున్నారు. అలాంటి వారికి పూర్తిస్థాయి వైద్యసేవలు అందించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలని సంకల్పించారు. ఇందుకు రూ.188 కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. ఇందులో 25శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగా, మిగిలిన నిధులు పరిశ్రమల యజమానులు ఇస్తున్నారు. ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వందపడకల ఆసుపత్రి భవనంతో పాటు ఆసుపత్రి పరికరాలు కొనుగోలు చేయడానికి రూ.70కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా లెక్కలు వేశారు. రూ.21.5 కోట్లతో ఆన్‌లైన్ విధానంలో టెండర్లు పిలిచి ఆస్పత్రికి అవసరమైన పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన రూ.118 కోట్లు 10 ఏళ్ల పాటు ఆస్పత్రిలో వైద్యులతో పాటు రెండు వందల మందికి వేతనాలు కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణలో చెల్లించనున్నారు.

సేవలు ఇలా...

జిల్లాలో మొదటిసారి 100 యూనిట్ల రక్తం నిల్వ సామర్థ్యం కలిగిన బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి లేనందున వైద్య విద్యార్థులు ఇక్కడ సూపర్ స్పెషాలిటీ కోర్సు పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగినప్పుడు గాయాలపాలయిన వారికి మందులతో కాకుండా ఫిజియోథెరపీ విధానంలో చికిత్సలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఒక అంతస్థు పూర్తిగా ఇందుకోసమే కేటాయిస్తున్నారు. కిడ్నీ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. సిటీ స్కాన్‌తో కూడిన ఐసీయూ వార్డు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ మెడికల్ సర్జన్, ఆర్థోపెడిక్, నరాలకు సంబంధించిన అన్ని రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేకంగా గైనకాలజీ విభాగం ఏర్పాటు చేస్తున్నారు. అన్ని రకాల ల్యాబ్‌ల్లో పరీక్షలు జరుగుతాయి. ఎన్ఐసీయూ కార్డియాలజీ, డయాలసిస్, ఎంఐసీయూ, న్యూరో, కార్డియాక్ ఐసీయూ, గైనకాలజీ, సర్జరీ, జనరల్ మెడిసిన్ వంటి వార్డులు ఉంటాయి. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ, క్యాత్ ల్యాబ్‌లతో పాటు ఐదు వెంటిలేటర్లను అందుబాటులో ఉంచనున్నారు. వీటికి సేవలు అందించేందుకు 38 మంది సూపర్ స్పెషాలిటీకి చెందిన వైద్యుల నియామక ప్రక్రియ పూర్తి చేశారు. వీరు ప్రస్తుతం ఇతర ఆసుపత్రుల్లో డిప్యూటేషన్ పద్ధతిలో పని చేస్తున్నారు. మరో 150 మంది స్టాఫ్, హెడ్ నర్సులతో పాటు కిందిస్థాయి సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తిచేశారు. ఇప్పటికే ఉన్న వందపడకల ఏరియా ఆసుపత్రికి అనుసంధానం చేసేటట్టు చర్యలు తీసుకుంటారు. రెండు ఆసుపత్రుల భవనాల్లో రాకపోకలు సాగించేందుకు వంతెన నిర్మించాలన్న ప్రతిపాదన ఆమోదం పొందలేదు.

ప్రారంభానికి సీఎంను ఆహ్వానిస్తా..

కార్మికుల కల సాకారం చేసాం. అన్ని రకాల కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నాం. పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుడికి ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. కాలుష్య ప్రభావిత అన్ని గ్రామాల ప్రజలు ఉచితంగా వైద్యసేవలు వినియోగించుకోవచ్చు. ఇందుకు రెండు వందల కోట్లు ఖర్చు చేశాం. అన్ని రకాల వైద్యులు అందుబాటులోకి రానున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపచేసేందుకు ఆలోచన చేస్తున్నాం.

- మహిపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, పటాన్‌చెరు

40 రోజుల్లో అందుబాటులోకి..

జిల్లాలో మొదటిసారి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది. ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల తరహాలో వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే వైద్యుల నియామక ప్రక్రియ పూర్తయింది. పరికరాల కొనుగోలు చేసేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. ల్యాబ్‌లు, మంచాల అమరిక పనులు జరుగుతున్నాయి. మరో 40 రోజుల్లో ఆస్పత్రిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, పటాన్‌చెరు

కిటకిటలాడిన నాచగిరి, విద్యాధరి క్షేత్రాలు


విద్యాధరి క్షేత్రంలో సామూహిక అక్షర స్వీకారాలు


నాచగిరిలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచగిరి లక్ష్మీ నృసింహ్మస్వామి క్షేత్రం, వర్గల్ విద్యాధరి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి. నాచగిరి క్షేత్రంలో లయ వేద పండితులు హోమం నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు వేలాది మంది తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారయణ స్వామి వ్రతాలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లను ఆలయ అధికారులు చేశారు. వర్గల్ విద్యాధరి క్షేత్రంలో చిన్నారులకు సామూహిక అక్షర స్వీకారాలు చేయించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్న ప్రసాదాలను అందజేశారు.



మెదక్ సీఎస్ఐ చర్చిలో భక్తుల సందడి

మెదక్ కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, ఈ ప్రార్థలకు రాష్ట్రంతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలించ్చారు. దీంతో చర్చిలోని ప్రత్యేక ప్రార్థన మందిరం భక్తులతో కిక్కిరిసింది. చర్చి ఆవరణ మొత్తం ఏసు నామ స్మరణతో మారుమోగింది. చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన సిలువ ముందు భక్తులు కొబ్బరి కాయలు కొడుతూ, కొవ్వొత్తులు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. మత గురువులు భక్తులను ఆశీర్వచనలందించారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ


శిథిలావస్థలో ములుగు ఆసుపత్రి భవనం


ఆస్పత్రి ఆవరణలో కూలిపోయిన నీటి సంపు

ములుగులో తిష్ఠవేసిన సమస్యలు
వర్షం పడితే లోపలంతా నీరే
ప్రహరీలేక పందుల స్వైరవిహారం

ములుగు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అక్కడ పని చేసే సిబ్బంది తాగేందుకు నీరుండదు కానీ, వర్షం వస్తే మాత్రం ఆ ఆస్పత్రిలోకి మాత్రం నీరు చేరుతుంది. ఇక నీటి సంపు కూలిపోయి ఏళ్లు కావొస్తోంది. ప్రహరీ లేక ఆస్పత్రి ప్రాంగణంలో పందులు స్వైర విహారం చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే సిద్దిపేట జిల్లా ములుగు ప్రభుత్వ ఆస్పత్రి సమస్య సుడిగుండంలో చిక్కుకుంది.

ఉమ్మడి ఆధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ములుగులో ప్రభుత్వాసుపత్రిని నిర్మించారు. అప్పుడు నాణ్యత లేని నిర్మాణం చేపట్టడంతో వర్షం పడినప్పుడల్లా పై కప్పు నుంచి నీరు లోపలికి రావడంతో గోడలు తడిసి ముద్దవుతున్నాయి. దీంతో పెచ్చులు ఊడిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో గజ్వేల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొత్తగా ప్రభుత్వాసుత్రులు నిర్మించారు. అందులో భాగంగా మండల కేంద్రమైన ములుగు ఆసుపత్రికి కూడా నూతన భవనం మంజూరైంది. ప్రభుత్వం మారడంతో నూతన భవనం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రికి కొత్త భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటివరకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మరమ్మతులు చేపట్టాలి

ములుగు ప్రభుత్వ ఆస్పత్రి భవనం వర్షం వస్తే ఉరుస్తోంది. నూతన భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. అప్పటి వరకు తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలి. భవనంలో సమస్యలు ఉండటంతో సిబ్బందితో పాటు ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

-దీప్తి, వైద్యాధికారి



ఎంపీ రఘునందన్‌ను సన్మానిస్తున్న నాయకులు, మనూరులో ఎంపీ సురేష్ షెట్కార్ పూజలు

ఆలయాల్లో మెదక్ ఎంపీ పూజలు

దుబ్బాక, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆదివారం పలు ఆలయాల్లో పూజలు చేశారు. దుబ్బాకలోని నల్లపోశమ్మ దేవాలయంను ఆయన సందర్శించారు. బాబాజగ్జీవన్‌రామ్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను ఆలయ ఉత్సవ నిర్వాహకులు, బాబూజగ్జీవన్‌రామ్ సంఘం నాయకులు చెక్కపల్లి రాజమల్లుతో పాటు సంఘం సభ్యులు సన్మానించారు.

ఎల్లమ్మ దేవాలయంలో..

తొగుట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం ఎంపీ రఘునందన్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు చిక్కుడు చంద్రం ముదిరాజ్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకల్లో సంగారెడ్డి ఎంపీ

నారాయణఖేడ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని మనూరు క్రాస్ రోడ్స్ వద్ద ఆదివారం మూడవ రోజున లలితాంబిక దేవి విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శ్రీచక్ర స్థాపన, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్, బీచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప, బర్దీపూర్ పీఠాధిపతి అవదూత్‌గిరి మహారాజ్, దుద్యాల పీఠాధిపతి అంబికా శివయోగి మహారాజ్ పాల్గొన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు.




పట్టుదలతో ప్రపంచ రికార్డు

35 ఏళ్ల వయస్సులో పరుగుపందెం
6.25 సెకండ్లలో 60 మీటర్లు
యోగాలోనూ ప్రావీణ్యం
ఉచిత శిక్షణ ఇస్తున్న యోగా గురు

సంగారెడ్డి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఆయన యోగా గురు. యోగా పాఠాలు చెప్పడం వరకే పరిమితం కాలేదు. 35 ఏళ్ల వయస్సులో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. అది కూడా తాను మొదటి నుంచీ సాధన చేస్తున్న యోగాలో కాదు... పరుగు పందెంలో. యోగా మాస్టర్‌గానే కాకుండా, పరుగుపందెంలో తనకంటూ ప్రత్యేకత చాటుతున్నారు బాచంపల్లి అజయ్‌కుమార్.

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన సురేందర్, రుక్మిణి దంపతుల కుమారుడు అజయ్‌కుమార్. తండ్రి సురేందర్ ఓడీఎఫ్ ఉద్యోగి. యోగా గురువు కావడంతో పరిశ్రమలో యోగా శిక్షణనందించేవారు. బాల్యం నుంచి తండ్రినే గురువుగా భావించి యోగాభ్యాసంలో ప్రావీణ్యం పొదారు అజయ్‌కుమార్. తండ్రి వద్ద శిక్షణ ప్రారంభించిన అజయ్‌కుమార్ 2006లో రామ్‌దేవ్ బాబా హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పిల్లల క్యాంపునకు హాజరయ్యారు. 2009లో హరిద్వార్‌లో యోగా టీచర్‌గా శిక్షణ పొంది 8 సంవత్సరాల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో యోగాలో సేవలందించారు. 2017లో సంగారెడ్డికి వచ్చి యోగా శిక్షకుడిగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 20 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణనందిస్తున్నాడు. ప్రస్తుతం సంగారెడ్డి కలెక్టరేట్ వెనుక భాగంలో ఉన్న పార్కులో ఉచిత యోగ శిక్షణ ఇస్తున్నారు.

పరుగుపందెంలో ప్రపంచ రికార్డు

● 2025 ఏప్రిల్ 3 నుంచి 7 వరకు నేపాల్ దేశంలో ఎస్‌బీకేఎఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పరుగు పందెంలో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రీడాపోటీల్లో ఇండియా, బుటాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సంగారెడ్డికి చెందిన అజయ్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబర్చి 60 మీటర్లు, 100, 200 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. 35 ఏళ్ల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో 6.25 సెకన్లలో పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించారు. అలాగే, రంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయిలో 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, 100, 200 మీటర్ల పరుగు పందెంలో 2 వెండి పతకాలు, రాష్ట్ర స్థాయిలో 200 మీటర్ల పరుగు పందెంలో 4 బంగారు, ఒకటి వెండి పతకాలు, జాతీయ స్థాయిలో 100, 200 మీటర్ల పరుగు పందెంలో ఒకటి బంగారు, 2 వెండి పతకాలు, అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన 100, 200 మీటర్ల పరుగు పందెంలో 3 బంగారు పతకాలు, వీటితో పాటు యోగా చాంపియన్‌షిప్‌లలో జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో నిర్వహించిన చాంపియన్‌షిప్‌లలో బంగారు, వెండి, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.



అవహేళన చేశారు..

60 మీటర్ల పరుగు పందెంలో ప్రపంచ రికార్డు సాధించడం 35 వయసులో సాధ్యం కాదని అందరు అవహేళన చేశారు. కానీ, పట్టుదలతో సాధించాను. యోగా చేసినందువల్లే పరుగుపందెంలో ప్రపంచ రికార్డు సాధించగలిగాను. ప్రస్తుతం యోగా సమ్మర్ ఫ్రీ క్యాంప్ ఉదయం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు మంగళ, గురు, శనివారాల్లో శిక్షణ అందిస్తున్నాను.

-బాచంపల్లి అజయ్‌కుమార్, యోగా గురు

న్యూస్ బాక్స్

కాంగ్రెస్‌లో మైనారిటీలకు స్థానం లేదు : బీఆర్ఎస్

కోహీర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌లో మైనారిటీలకు సముచిత స్థానం లభించడం లేదని బీఆర్ఎస్ మైనారిటీ మండల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా మైనారిటీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం పట్ల కాంగ్రెస్‌పై మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చిందని, కాంగ్రెస్ హయాంలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పి. సందీప్‌కుమార్, అస్లాం, దినకర్, వాజిద్, మొయిజ్, ఇమ్రాన్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు సిద్ధం

అల్లాదుర్గం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాయితీపై రైతులకు అందించే పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయ శాఖ అల్లాదుర్గం మండల అధికారి రాజేశ్‌కుమార్ ఆదివారం తెలిపారు. 30 కిలోల జీలుగ బస్తా రూ.4,275, 50 శాతం రాయితీపై రూ.2,137కి అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు అల్లాదుర్గం రైతువేదికకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్సు ప్రతులతో పొందాలని సూచించారు. ప్రతి రైతుకు ఒక్క బస్తా మాత్రం అందిస్తామని తెలిపారు.

మెళకువలతో అధిక లాభాలు

పాపన్నపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయంలో మెళకువలు పాటించి అధిక లాభాలు పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని గాందారిపల్లిలో రైతులకు వానాకాలం పంటలపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. అధిక దిగుబడి ఇచ్చే వరి రకాలు, విత్తన శుద్ధి, ఎరువుల వాడకంపై పలు సూచనలు, సలహాలు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రవి, రమేష్, దాసు, చిన్నబాబు, ఏఈవో జనార్ధన్ పాల్గొన్నారు.

జోగిపేటలో కబడ్డీ టోర్నమెంట్

జోగిపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలో ఈనెల 14 నుంచి కబడ్డీ టోర్నమెంట్ (అండర్-18) నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు నియోరాక్‌స్టార్స్ అసోసియేషన్ తెలిపింది. మాజీ కౌన్సిలర్ పులుగు గోపాల్ సౌజన్యంతో.. ఈనెల 14, 15 తేదీల్లో పట్టణంలోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించబోయే ఈటోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.6 వేల నగదు బహుమతిని అందజేయనున్నట్టు వారు వివరించారు. ఈపోటీల్లో అందోలు తాలూకాలోని 18 ఏళ్లలోపు క్రీడాకారులకు మాత్రమే పాల్గొనే అర్హత ఉంటుందన్నారు. క్రీడాకారులకు భోజన వసతి అకల్పిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 13లోపు 6300380079, 7815873520, 9505964317 ఫోన్ నెంబర్లలో సంప్రదించి తమ టీం లను నమోదు చేసుకోవాలన్నారు. అదేరోజు సాయంత్రం డ్రాలు తీస్తామన్నారు.

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

అల్లాదుర్గం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అల్లాదుర్గం ఎస్ఐ డీ.శంకర్ తెలిపారు. ఆదివారం అల్లాదుర్గం ఐబీ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఎవరైనా రోడ్డు నిబంధనలు పాటించకుంటే వారిని ఉపేక్షించమని హెచ్చరించారు. ప్రధానంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని వివరించారు. ఈ ప్రమాదాల నివారణ కోసం నిత్యం పెట్రోలింగ్ నిర్వహించి వాహనాలను తనిఖీలు చేస్తూ ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురు చేరిక

గుమ్మడిదల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ చెందిన ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కనకరాజు ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి కనకరాజుతో పాటు పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ యువత నాయకత్వం పార్టీకి అవసరమని, కనకరాజు చేరికతో బీఆర్ఎస్ బలపడుతుందన్నారు. పార్టీలోకి వచ్చిన కొత్త నాయకులను ఆదరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి దేవేందర్ రెడ్డి, జింక గోపాల్, యాదిరెడ్డి, లక్ష్మణ్, సూర్యనారాయణ, చంద్రారెడ్డి, శ్రీకాంత్, కౌశిక్ గౌడ్,వినోద్ గౌడ్, చంద్రశేఖర్,పలువురు కార్యకర్తలు హాజరయ్యారు.



రేగోడులో క్రీడా ప్రాంగణం



టి లింగంపల్లిలో ఆట వస్తువులు లేని క్రీడా ప్రాంగణం

అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణాలు

- ఆట వస్తువుల్లో అవినీతి
- వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు

రేగోడు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ యువత కోసం అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మారాయి. గత ప్రభుత్వంలో నిర్మించిన క్రీడా ప్రాంగణాలలో ఆట వస్తువులు లేకపోవడం భారీ అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. మెదక్ జిల్లా రేగోడు మండలంలో గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున క్రీడా ప్రాంగణాలను గత ప్రభుత్వం నిర్మాణాలు చేసింది. మండలంలో 18 గ్రామ పంచాయతీలకు క్రీడా ప్రాంగణాలు నిర్మించాల్సి ఉండగా, మర్పల్లి గ్రామపంచాయతీలో ప్రభుత్వ స్థల వివాదంలో ఉందని క్రీడా ప్రాంగణాన్ని నిర్మించలేకపోయారు. మండల కేంద్రం రేగోడులోనే హైస్కూల్ గ్రౌండ్‌తో పాటు మోడల్ స్కూల్ సమీపంలో రూ.1.80 కోట్లతో రెండు క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. కానీ ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి.

బోర్డులకే పరిమితం

గత ప్రభుత్వంలో గ్రామీణ యువత కోసం గ్రామపంచాయతీలలో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితమయ్యాయి. రూ.10 లక్షలు ఖర్చు చేసినా సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయకుండానే నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేసినట్లు తెలుస్తుంది. మండలంలో ఏర్పాటు చేసిన 18 క్రీడా ప్రాంగణాల్లో ఆట వస్తువులు ఎక్కడా కనిపించడం లేవు. ఆట వస్తువుల కోసం లక్షల్లో ఖర్చు చేసినట్లు రికార్డులు చేసినట్లు తెలుస్తోంది. క్రీడా ప్రాంగణాల నిధులలో చేతివాటం చూపినట్లు ఆరోపణలు ఉన్నాయి. టి లింగంపల్లి క్రీడా ప్రాంగణం బోర్డుకే లక్షలు ఖర్చు చేశారా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈదులనాగులపల్లి రైల్వేగేట్‌ను తెరవాలి

- రైల్వే జీఎంను కోరిన ఎంపీ
- మూడురోజుల్లో తెరిచేందుకు ఏర్పాట్లు



ఈదులనాగలపల్లి క్రాసింగ్ వద్ద మూసివేసిన రైల్వేగేట్

రామచంద్రాపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : యుద్ధప్రాతిపదికన రామచంద్రాపురం మండలం ఈదులనాగులపల్లి రైల్వేగేట్‌ను తెరవాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దక్షిణ మధ్య రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. రైల్వే గేట్ మూసివేయడంతో చుట్టూ తిరిగి గ్రామానికి చేరుకునేందుకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీ పేర్కొన్నారు. గతంలో సమస్యపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ప్రజాప్రతినిధులు స్పందించారు. మరోవారంలో పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులను గుర్తించి గేట్ తెరవాలని ఎంపీ రఘునందన్‌రావు రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జీఎం త్వరలో గేట్‌ను తెరుస్తామని హామీ ఇచ్చారని ఎంపీ కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తున్న గిరిధర్‌రెడ్డి, తదితరులు

జహీరాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డా.సిద్ధం ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్, తదితర గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరీపత్రాలను అందజేసి నిర్మాణాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు నిరుత్సాహానికి గురికావద్దని, అర్హులైన ప్రతిఒక్కరికీ మున్ముందు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమఫలాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ముబిన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గుండారెడ్డి, హర్షద్‌పాటిల్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు



సమావేశంలో మట్లాడుతున్న చుక్క రాములు

జిన్నారం, జూన్, 8 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల న్యాయమైన హక్కుల సాధనకు సీఐటీయూ నిరంతర పోరు జరుపుతుందని రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం కాజీపల్లి పారిశ్రామికవాడలోని టీబీసీ పరిశ్రమలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమష్టి పోరాటాలతో తమ న్యామమైన హక్కుల సాధనకు కార్మికులు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక కోడ్‌ల రద్దు కోసం సంఘటితంగా పోరాటం చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

అవయవదానం చేసి ప్రాణదాతలు కండి



మాట్లాడుతున్న గురు ప్రకాష్

హత్నూర, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : అవయవ దానం చేసి ప్రాణదాతలు కండి అని శరీర అవయదాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురు ప్రకాష్ అన్నారు. హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామంలో ఆదివారం మహిళా సంఘం భవనంలో శరీర అవయవదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా అవయవదానం గొప్పదని అన్నారు. ప్రమాదవశాత్తు ప్రాణం పోయే ముందు ఆ క్షతగాత్రుని అవయవాలు దానం చేస్తే మరో 18 మంది ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మడపతి రవికుమార్, సంగారెడ్డి జిల్లా కో ఆర్డినేటర్ వెంకోబా, ఆర్.వెంకట్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మహిళా సంఘం అధ్యక్షురాలు స్వప్న పాల్గొన్నారు.

దళితుల ఆలయంలో మద్యం సీసాల పారవేత



ఆలయంలో వేసిన ఖాళీ బీర్ సీసాలు

శివ్వంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించిన గుర్తుతెలియని వ్యక్తులు అలయంలో ఖాళీ బాటిళ్లను ఆలయంలో పెట్టిన సంఘటన శివ్వంపేటలో ఆదివారం చోటు చేసుకున్నది. మండల కేంద్రమైన శివ్వంపేటలోని దళితుల మాత పోచమ్మ ఆలయం సమీపంలో మద్యం సేవించిన వ్యక్తులు 15 ఖాళీ బీరు సీసాలను ఆలయంలో వేసి వెళ్లిపోయారు. ఈ ఘటనకు పాల్పడ్డవారిని కఠినంగా శిక్షించాలని పలువురు దళితులు కోరుతున్నారు.

బ్రాహ్మణ సంప్రదాయాల్ని కించపరిస్తే ఊరుకోం

సంగారెడ్డి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సినిమా మాధ్యమంగా బ్రాహ్మణులను కించపరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర (టీబీఎస్ఎస్ఎస్) ఉపాధ్యక్షుడు విజయభాస్కర్ దేశ్‌పాండే, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్ కులకర్ణి, జిల్లా మాజీ పీఆర్వో శ్యామ్ రావు పట్వారీ, సంగారెడ్డి, పటాన్ చెరు మండలాల అధ్యక్షులు రవిశంకర్ కుమార్, వాసుదేవరావు, సంగారెడ్డి మండలాధ్యక్షురాలు శిరీషాఅశోక్ హెచ్చరించారు. ఆదివారం వారు జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సినిమాల్లో కులపరంగా, వృత్తిపరంగా, బ్రాహ్మణులను కించపరిచేలా, గేలిచేసేలా సన్నివేశాలను చిత్రీకరించడం, ఫ్యాషన్‌గా మారిందన్నారు. త్వరలో విడుదల కానున్న 'కన్నప్ప' సినిమాలోనూ బ్రాహ్మణ సంప్రదాయమైన పిలకను కించపరిచేలా ఇద్దరు వ్యక్తులకు పిలక, గిలక అని పేర్లు పెట్టడంతోపాటు వారిని జోకర్లుగా చిత్రీకరించడం దారుణమన్నారు. దీనిపై బ్రాహ్మణ సంఘాలు సెన్సార్ బోర్డుకు ఫిర్యాదు చేసినా, సెన్సార్ బోర్డు కూడా ఆక్షేపించకపోవడం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు సురేశ్ జ్యోషి, వసపంత్‌రావుపటేల్, మారుతిరావు, నరసింహారావు కులకర్ణి, పాండురంగారావు, మహేందర్, రజని రమేశ్, జ్యోతి చంద్రిక పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో ఈజీఎస్ గ్రామసభలు

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని ఖాజాపూర్, బొక్కస్‌గామ్, సూర్యాతండా, జంలాతండా, గరిడేగామ్, వగ్ధల్ గైర్హాన్‌తండా, చిన్న ముభారక్‌పూర్ గ్రామాల్లో ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామసభలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ రాజు మాట్లాడుతూ గ్రామాల్లో పనులు నిర్వహణ సక్రమంగా జరిగిందా, లేదా అని ఈజీఎస్ సామాజిక తనిఖీ సిబ్బంది విచారణ చేస్తారని తెలిపారు. పనుల్లో అవకతవకలు జరిగితే సామాజిక తనిఖీ బృందాలకు గ్రామస్థులు తెలియజేయాలని వారు సూచించారు.



ముదిరాజ్‌భవన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



ముదిరాజ్ భవన్ శంకుస్థాపనలో నీలం మధుముదిరాజ్

ముదిరాజ్‌ల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తా

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- అమీన్‌పూర్‌లో ముదిరాజ్‌భవన్‌కు శంకుస్థాపన

అమీన్‌పూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలోని ముదిరాజ్‌ల సంక్షేమానికి శక్తించన లేకుండా చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్ నవ్యరోడ్డులో ముదిరాజ్ భవన్ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొని మాట్లాడారు. తాను మూడుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడంలో ముదిరాజ్‌ల తోడ్పాటు మరువలేనిదన్నారు. సేవా దృక్పథం, ధైర్యానికి మారుపేరైన ముదిరాజ్‌లు తెలంగాణ పునర్నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. గతంలో పటాన్‌చెరులో రూ.2 కోట్లతో ముదిరాజ్ భవన్‌ను ఆధునీకరించామన్నారు. అమీన్‌పూర్ ముదిరాజ్ భవన్ నిర్మాణానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీఇచ్చారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర క్యాబినెట్‌లో ముదిరాజ్‌లకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్, మాజీ ఎంపీపీ ఈర్లదేవానంద్, మాజీ వైస్ చైర్మన్ నందారం నర్సింహాగౌడ్, నాయకులు చంద్రకళగోపాల్, చదువు మల్లేష్, కొల్లూరు మల్లేష్, బిజిలి రాజు, ఉపేందర్, కృష్ణ, రాములు, బాశెట్టి అశోక్, రాజేష్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలని కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ భవన్ శంకుస్థాపనలో పాల్గొని మాట్లాడుతూ ముదిరాజ్‌లకు సరైన రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. బీసీ గులగణన చేపట్టిన తరువాత ముదిరాజ్‌లకు ప్రాధాన్యం పెరిగిందని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల్లో ముదిరాజ్‌లు సత్తా చాటాలన్నారు. అమీన్‌పూర్‌లో ముదిరాజ్‌భవన్ నిర్మాణానికి పూర్తి స్థాయిలో సహకరిస్తానన్నారు.

కీలక పోస్టులన్నీ ఖాళీ!

5వ పేజీ తరువాయి

అధికారి వెంకటయ్యకు అదనపు బాధ్యతలను అప్పగించారు. వీరితో పాటు ఆహార భద్రత అధికారి, ఎక్సైజ్, ఆర్టీఏ, మైనింగ్, బీసీ సంక్షేమ, పశు సంవర్ధక, లీగల్ మెట్రాలజీ, భూగర్భజల, సబ్‌రిజిస్ట్రార్, ఎంప్లాయిమెంట్, ఇంటర్ జిల్లా నోడల్ అధికారి, విజయ డెయిరీ, వయోజన విద్యాశాఖ, డీఎస్ ఎపీఆర్వో, మార్కెటింగ్ ఏడీ, కోఆపరేటివ్, మార్క్‌ఫెడ్, డీఎం సోలార్, హ్యాండ్లూమ్, ఆరోగ్యశాఖల అధికారులు పూర్తి అదనపు బాధ్యతలతో కొనసాగుతున్నారు.

ఇన్‌చార్జిల పాలనతో కుదేలు

గ్రామాలు, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు లేక అధికారులే పరిపాలనా బాధ్యతలు చేపడుతున్నారు. వీరు ఆయా శాఖల ఉన్నతాధికారులుగానూ విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. తమ శాఖకు చెందిన విధులతో పాటు ప్రత్యేకాధికారుల బాధ్యతలు కూడా తోడవడంతో న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం, ఇందిర్మ ఇళ్లు, భూ భారతి చట్టం, సన్న బియ్యం పంపిణీ తదితర పథకాలు, అభివృద్ధి పనుల అమలుపై అధికారుల కొరత ప్రభావం పడుతున్నది. పంచాయతీరాజ్, రెవన్యూ, గృహనిర్మాణ తదితర శాఖల్లో కిందిస్థాయి సిబ్బంది కూడా సరిపడా లేరు. దీంతో, క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి అదనపు కలెక్టర్‌తోపాటు ఇతర శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తేనే జిల్లా ప్రగతిపథంలో దూసుకుపోతుందని ప్రజలు కోరుతున్నారు.

మురుగు శుద్ధిపై ముందడుగు

5వ పేజీ తరువాయి

శుద్ధి చేసిన నీటిని తిరిగి వాటిలోకి వదలాల్సింది పోయి కొండలపైకి మురుగు లిఫ్ట్ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. గ్రావిటీతో ప్రవహించాల్సిన మురుగునీటిని పంపింగ్ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని, ఇందుకోసం ఖర్చు తడిసిమోపెడవుతుందని వారు పేర్కొంటున్నారు. పైగా ఎస్‌టీపీ ఏర్పాటుకు సూచిస్తున్న స్థలం పక్కనే మిలీనియం స్కూల్, నవోదయ విద్యాలయాలకు స్థలాలను కేటాయించారని గుర్తు చేస్తున్నారు. విద్యాసంస్థల మధ్య మురుగుశుద్ధి కేంద్రం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో ప్రత్యామ్నాయ స్థలం ఎంపికపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



ఖానాపూర్(కె)లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

కల్హేర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తన స్వగ్రామంలో పెద్ద శంకరంపేట మండల పరిధిలోని టెంకటి గ్రామానికి చెందిన జింక కాశీరాంకు రూ.27 వేలు, నిజాంపేట మండలం నాగ్ధర్‌కు చెందిన చిన్న నాయకుని బాలయ్యకు రూ.60 వేల విలువ గల చెక్కులను భూపాల్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంజయ్య, గోవింద్, అడివప్ప పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన మాజీ ప్రజాప్రతినిధులు

ఐడీఏబొల్లారం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం మున్సిపల్ పట్టణ శ్రీరామ్‌నగర్ కాలనీలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. చుట్టుపక్కల కాలనీవాసులు పెద్దఎత్తున హాజరై ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, సంధ్య, జైపాల్ రెడ్డి, పుండరీకం, శైలజ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన

జిన్నారం, జూన్, 8 (ఆంధ్రజ్యోతి) : మాదారంలో 33 అడుగుల ఎత్తైన పంచముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కోసం జిన్నారం మండలం మాదారం రామాలయం ఆవరణలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భూమిపూజ, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, విజయ్‌కుమార్ గౌడ్, మాణిక్‌యాదవ్, స్వామిమహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే మంచి సదుపాయాలు



చందాపూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : సర్కారు బడుల్లోనే మంచి సదుపాయాలు ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వెంకటాపూర్, జూకల్, జూకల్ తండా, చందాపూర్, సత్యగామ, రుద్రారం గ్రామాల్లో ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాటను నిర్వహించారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ బుక్స్, స్కూల్ డ్రెస్, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించడంతో ప్రత్యేకంగా ఉచిత కంప్యూటర్ శిక్షణ, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ వంటివి ఉన్నాయని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు హమీద్, గురునాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బిల్లుల కోసం ఎదురుచూపులు

- రెండు రోజులన్నారు.. పక్షం రోజులైనా అందని బిల్లులు

అల్లాదుర్గం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే, రెండు, మూడురోజుల్లో బిల్లులు చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ధాన్యం విక్రయించి పక్షం రోజులు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని అల్లాదుర్గానికి చెందిన పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 15 రోజుల క్రితం ధాన్యం విక్రయించామని, బిల్లుల కోసం అధికారులను కోరితే ఇదిగో..అదిగో అంటూ కాలం గడుపుతున్నారని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్న నేపథ్యంలో తాము వ్యవసాయ పనులను వదులుకొని అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు ధాన్యం డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.